క్లుప్తంగా

మద్దిపాడు తహసీల్దార్‌గా అనూరాధ



తహసీల్దార్ అనూరాధ

మద్దిపాడు: మండల తహసీల్దార్‌గా పీ అనూరాధ నియమితులయ్యారు. ఎలక్షన్ కోడ్ రానున్న నేపథ్యంలో మద్దిపాడు తహసీల్దార్‌గా ఆమె బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పెండింగ్ ఫైళ్లను పరిష్కరించాలని సిబ్బందికి సూచించారు. ఎన్నికల విధులను ప్రతి ఉద్యోగి జాగ్రత్తగా నిర్వహించాలన్నారు. నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవన్నారు. పలువురు కార్యాలయ సిబ్బంది ఆమెను మర్యాదపూర్వకంగా కలిసి పుష్ప గుచ్ఛం అందించారు.

కరాటేలో ఆక్స్‌ఫర్డ్ విద్యార్థులకు బంగారు పతకాలు



పతకాలు సాధించిన విద్యార్థులను అభినందిస్తున్న యాజమాన్యం

నాగులుప్పలపాడు: విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో కూడా రాణించడం, అందులో కూడా ఆత్మరక్షణకు ఉపయోగపడే మార్షల్ ఆర్ట్స్ వంటి క్రీడల్లో ప్రతిభ చూపడం మంచి విషయమని ఆక్స్‌ఫర్డ్ పాఠశాల ప్రిన్సిపాల్ లక్ష్మీ భవాని అన్నారు. చిలకలూరిపేట బృందావనం హాలులో సోమవారం నిర్వహించిన జాతీయ స్థాయి కరాటే పోటీల్లో ఆక్స్‌ఫర్డ్ పాఠశాల విద్యార్థులు బలమూరి జోష్నశ్రీ, బలమూరి ప్రేక్షిత, పసుపులేటి ధీరజ్, విజయ్ కటాస్ విభాగంలో బంగారు పతకాలు సాధించారు. భవ్యశ్రీ, సాయి స్నిగ్ధా వెండి పతకాలు, బిందుశ్రీ కాంస్య పతకం సాధించారు. ఈ సందర్భంగా సోమవారం పాఠశాలలో ఏర్పాటు చేసిన అభినందన సభలో ప్రిన్సిపాల్, అధ్యాపక సిబ్బంది విద్యార్థులను అభినందించారు.

ప్రభుత్వ ఉద్యోగులకు ఇచ్చిన పట్టాలు రద్దు చేయండి

చీమకుర్తి: చీమకుర్తి పట్టణ పరిధిలోని జగనన్న కాలనీ లేఅవుట్‌లలో ప్రభుత్వ ఉద్యోగులు, సచివాలయ ఉద్యోగులకు ఇచ్చిన పట్టాలను రద్దు చేయాలని కాంగ్రెస్ పార్టీ నాయకుడు దాసరి రవి సోమవారం కలెక్టర్‌కు వినతిపత్రం అందించారు. ఒంగోలులో గ్రీవెన్స్ డేలో కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం ఇచ్చినట్లు చీమకుర్తిలో మీడియాకు ఒక ప్రకటనలో తెలిపారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేదలకు ప్రతిష్టాత్మకంగా ఇస్తున్న ఇంటి స్థలం పట్టాలను కొంత మంది ఉద్యోగులకు తహసీల్దార్, వీఆర్‌ఓలు పరిశీలించి కూడా సిఫార్సు చేయటం వెనుక ఉన్న ఆంతర్యం ఏమిటని ప్రశ్నించారు. ఉద్యోగులుగా పనిచేస్తూ పట్టాలు తీసుకుని ఇటీవల రిజిస్ట్రేషన్లు కూడా చేయించుకున్నారని తెలిపారు. వారికి ఇచ్చిన పట్టాలను రద్దు చేసి అర్హులైన పేదలకు ఇవ్వాలని కలెక్టర్‌ను కోరారు.

ఆస్పత్రికి వెళ్లి పింఛన్ అందించిన వలంటీర్



ఆస్పత్రికి వెళ్లి పింఛను అందిస్తున్న వలంటీర్ బాల అంజమ్మ

చీమకుర్తి: మండలంలోని అయ్యపరాజుపాలెం గ్రామానికి చెందిన చిన్నపురెడ్డి తిరుపతమ్మ కాలు దెబ్బతగిలి ఒంగోలు ఆస్పత్రిలో చికిత్స పొందుతోంది. అదే గ్రామానికి చెందిన మహిళా వలంటీర్ బాల అంజమ్మ పింఛను ఇవ్వడానికి తిరుపతమ్మ ఇంటికి వెళితే ఆస్పత్రిలో ఉందని తెలిసింది. తన సొంత డబ్బుతో ఒంగోలు చేరుకుని ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న తిరుపతమ్మకు వైఎస్సార్ పెన్షన్ కానుక నగదు రూ.3 వేలను అందించి వచ్చింది. వలంటీర్ బాల అంజమ్మను లబ్ధిదారుతో పాటు గ్రామస్తులు అభినందించారు.



3వ డివిజన్‌లో లబ్ధిదారులకు ఇంటి పట్టాలు పంపిణీ చేస్తున్న బాలినేని ప్రణీత్‌రెడ్డి



5వ డివిజన్‌లో లబ్ధిదారులకు ఇంటి పట్టాలు పంపిణీ చేస్తున్న బాలినేని శ్రీకావ్య



9వ డివిజన్‌లో ఇంటి పట్టాల పంపిణీ కార్యక్రమంలో భారీగా పాల్గొన్న లబ్ధిదారులు

టీడీపీ హయాంలో ఒక్క పట్టా ఇవ్వలేదు

- ఐదు రోజులకోసారి మంచినీళ్లు ఇచ్చేవారు
- గోపాల్‌నగర్‌లో పట్టాల పంపిణీ కార్యక్రమంలో ఒంగోలు ఏఎంసీ చైర్మన్ కొఠారు రామచంద్రరావు
- నగరంలోని ఐదు డివిజన్లలో పట్టాలు పంపిణీ చేసిన ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి, కుటుంబ సభ్యులు

ఒంగోలు సబర్బన్: టీడీపీ ప్రభుత్వ హయాంలో ఒక్క పేద కుటుంబానికి కూడా ఇంటి స్థల పట్టా ఇచ్చిన పాపాన పోలేదని ఒంగోలు వ్యవసాయ మార్కెట్ కమిటీ (ఏఎంసీ) చైర్మన్ కొఠారు రామచంద్రరావు విమర్శించారు. నవరత్నాలు–పేదలందరికీ ఇళ్లు కార్యక్రమంలో భాగంగా సోమవారం 5వ డివిజన్ పరిధిలోని తిరుపతమ్మ గుడి వద్ద రిజిస్ట్రేషన్ చేసిన ఇంటి స్థల పట్టాలను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఒంగోలు నగర కమిషనర్ ఎం.జశ్వంత రావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి ఒంగోలు ఎమ్మెల్యే, మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి, శచీదేవి దంపతులు, మేయర్ గంగాడ సుజాత ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఏఎంసీ చైర్మన్ కొఠారు రామచంద్రరావు మాట్లాడుతూ గత ఐదేళ్ల టీడీపీ పాలనలో పేదలకు ఒక్క ఇంటి స్థల పట్టా ఇవ్వకపోగా, బాలినేని శ్రీనివాసరెడ్డి ఇళ్ల పట్టాలు ఇద్దామనుకున్నప్పుడల్లా ఏదోక రకంగా అడ్డంకులు సృష్టిస్తూ టీడీపీ నాయకులు శునకానందం పొందారన్నారు. ఎన్ని అడ్డంకులు సృష్టించినా అర్జునుడులా బాలినేని పోరాడి చివరకు పేదల కళ్లల్లో ఆనందం చూస్తున్నారన్నారు. టీడీపీ ప్రభుత్వ హయాంలో నగరంలో ఐదు రోజులకు ఒకసారి మంచినీళ్లు ఇచ్చేవారని, అర్ధరాత్రులు నీటి కాపలా కాసుకుంటూ ఆడామగా ఎదురు చూసేవాళ్లని గుర్తుచేశారు. ప్రస్తుతం ఆ పరిస్థితి లేదన్నారు. నవరత్నాలు–పేదలందరికీ ఇళ్లు కార్యక్రమంలో భాగంగా మొదట 9వ డివిజన్‌లోని పులివెంకటరెడ్డికాలనీలో తొలుత బాలినేని దంపతులు ఇళ్ల రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్‌తో పాటు లబ్ధిదారులైన దంపతులకు నూతన దుస్తులు పంపిణీ చేశారు. అనంతరం 3వ డివిజన్‌లోని బలరాం కాలనీలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో డాక్యుమెంట్లు, దుస్తులు పంపిణీ చేశారు. అనంతరం గోపాల్‌నగర్‌లో, తరువాత కబాడిపాలెంలోని శారదా బాలకుటీర్ వద్ద 11, 13 డివిజన్లలోని లబ్ధిదారులకు పట్టాలు, దుస్తులు పంపిణీ చేశారు.



ఒంగోలు 9వ డివిజన్‌లో లబ్ధిదారులకు ఇంటి పట్టాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి, శచీదేవి దంపతులు



ఈతముక్కలలో పట్టాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి



హెల్త్ క్లినిక్ భవనం శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి

ఆదర్శ గ్రామంగా ఈతముక్కల

- రూ.10.67 కోట్లతో నిర్మించిన ప్రభుత్వ భవనాలను ప్రారంభించిన ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి

ఈతముక్కల (కొత్తపట్నం): జిల్లాలోనే ఈతముక్కల గ్రామాన్ని ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దినట్లు మాజీ మంత్రి, ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి తెలిపారు. అందుకు కృషి చేసిన జిల్లా అగ్రికల్చర్ అడ్వైజరీ బోర్డు చైర్మన్, ఎంపీటీసీ ఆళ్ల రవీంద్రరెడ్డి, గ్రామస్తులను అభినందించారు. మండలంలోని ఇతర గ్రామాలను ఇదే విధంగా అభివృద్ధి చేయాలని, తన సహకారం పూర్తిగా ఉంటుందని బాలినేని అన్నారు. ఈతముక్కల గ్రామంలో రూ.10.67 కోట్లతో నిర్మించిన సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, హెల్త్ క్లినిక్ సెంటర్, జగనన్న పాల వెల్లువ కేంద్రం, సీసీ రోడ్లను సోమవారం బాలినేని శ్రీనివాసరెడ్డి రిబ్బన్ కట్‌చేసి ప్రారంభించారు. ముందుగా రూ.35 లక్షలతో షాదీఖానా శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. బస్టాండ్ సెంటర్‌లోని దివంగత సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి, పక్కనే ఉన్న కేశవరపు రామలింగారెడ్డి, బీఆర్ అంబేడ్కర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అక్కడి నుంచి ర్యాలీగా వెళ్లి ఈతముక్కల బైపాస్ రోడ్డును ప్రారంభించారు. అనంతరం ప్రభుత్వ భవనాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశానికి జిల్లా అగ్రికల్చర్ అడ్వైజరీ బోర్డు చైర్మన్ ఆళ్ల రవీంద్రరెడ్డి అధ్యక్షత వహించగా, బాలినేని మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి మాట ఇచ్చిన విధంగా పథకాలన్నీ నెరవేర్చారని తెలిపారు. ఈతముక్కల గ్రామానికి ఇచ్చిన నిధులన్నీ ఉపయోగించుకుని మండలంలో ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దడం మంచి విషయమన్నారు. టీడీపీ ప్రభుత్వంలో చంద్రబాబునాయుడు ఒక్క పథకం కూడా సక్రమంగా అమలుచేయలేదన్నారు. జన్మభూమి కమిటీల పేరుతో వారికి ఇష్టమొచ్చిన వారికే ఇచ్చారన్నారు. ముస్లింలు, ఎస్సీలు ఇళ్ల పట్టాలు అడిగారని, డబ్బు అకౌంట్‌లో ఉన్నాయని, వెంటనే భూమి కొనుగోలు చేసి ఇచ్చేందుకుఏర్పాట్లు చేస్తామని బాలినేని హామీ ఇచ్చారు. వ్యవసాయ విద్యుత్ రాత్రులు ఇస్తున్నారని రైతులు తన దృష్టికి తెచ్చారని, వెంటనే పగలే ఇచ్చేలా చూస్తానని అన్నారు. ఒంగోలు ప్రజలకు పోరాటం చేసి మరీ 25 వేల ఇళ్ల పట్టాలు ఇస్తున్నామన్నారు. రవీంద్రరెడ్డి మాట్లాడుతూ ఈతముక్కలలో ప్రభుత్వ భవనాల ఏర్పాటుకు సహకరించిన వారందరికీ కృతజ్ఞతలు తెలిపారు. గ్రామంలో ఐదు ఎకరాలను రూ.16 లక్షలతో కొనుగోలు చేసి 142 మందికి ఇళ్ల పట్టాలు మంజూరు చేశామన్నారు. అక్కడ మౌలిక వసతులు కల్పించడం జరిగిందన్నారు. అనంతరం ఇళ్ల పట్టాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర మత్స్యకార వెల్ఫేర్ అండ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ వాయల సుమతి, మాజీ ఎమ్మెల్యే కసుకుర్తి ఆదెన్న, మాజీ ఎంపీపీలు వాయల మోహన్‌రావు, బలగాని శ్రీనివాసరావు, సర్పంచ్ మేడికొండ సునీత, ఎంపీటీసీ సభ్యురాలు బండారు రుక్మిణమ్మ, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు చెరుకూరి రాఘవరావు, గ్రామ అధ్యక్షుడు అడిగోపుల లక్ష్మీనారాయణ, పిచ్చిరెడ్డి, సచివాలయ కన్వీనర్లు కసుకుర్తి శ్రీను, మిట్నసల శాంతారావు, వీఆర్‌సీ రెడ్డి, కేశవరపు కోటిరెడ్డి, రాంబాబు, గిరిస్వాములు, పీఆర్ డీఈ కాకుమాను శివరామకృష్ణారావు, తహసీల్దార్ హేమంత్ కుమార్, ఎంపీడీవో ఫణికుమార్‌నాయక్, తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి

ముగిసిన సంపూర్ణ రామాయణ ప్రవచన యజ్ఞం

- కన్నుల పండువగా సీతారాముల కళ్యాణం



రాములోరి పూజలో పాల్గొన్న మహిళా భక్తులు

ఒంగోలు మెట్రో: దుష్ట శిక్షణ, శిష్ట రక్షణ కోసం అవతరించిన రామావతారం రావణాసురుడి వధతో జగత్ విఖ్యాతిగాంచిందని ప్రముఖ ఆధ్యాత్మిక ఉపన్యాసకుడు, ప్రకాశం జిల్లా రచయితల సంఘం అధ్యక్షుడు పొన్నూరు శ్రీనివాసులు అన్నారు. పది రోజులుగా ఒంగోలు మండలం వలేటివారిపాలెం కోదండ రామస్వామి దేవస్థానంలో నిర్వహిస్తున్న వాల్మీకి సంపూర్ణ రామాయణ ప్రవచన యజ్ఞం సోమవారం రావణాసురుడి వధతో ముగిసింది. పొన్నూరు శ్రీనివాసులు పాల్గొని ఆధ్యాత్మిక ఉపన్యాసాలు, రామాయణంలోని బాలకాండ, అయోధ్య కాండ, అరణ్యకాండ, కిష్కింధకాండ, సుందరకాండ, యుద్ధకాండలోని ప్రముఖమైన ఘట్టాలను భక్తులకు వివరించారు. వాల్మీకి రామాయణం పారాయణం, శ్రవణం పుణ్యఫలమని అన్నారు. అయోధ్యలో బాలరాముడి విగ్రహ ప్రతిష్ఠ అనంతరం మొట్టమొదటిగా సంపూర్ణ రామాయణ ప్రవచన యజ్ఞాన్ని ఏర్పాటు చేసిన నిర్వాహకులను అభినందించారు. రావణాసురుడి ఘట్టం పూర్తయిన వెంటనే మహిళా భక్తులు దండరామ స్వామికి హారతులు పట్టి జై శ్రీరామ్ అంటూ స్మరించుకున్నారు. ముగింపు సందర్భంగా సీతారాముల కళ్యాణాన్ని, శ్రీరామ యజ్ఞాన్ని నిర్వాహకులు నల్లమోతు బాలగంగాధర్, ఇందుమతి దంపతులు, ప్రవచకుడు పొన్నూరు శ్రీనివాసులు, పద్మావతి దంపతులు ఘనంగా జరిపించారు. అర్చకుడు నారాయణం కళ్యాణ్ చక్రవర్తి, నారాయణం వేణుగోపాల్, కృష్ణ కిరీటి పూజా కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులకు అన్న ప్రసాద వితరణ చేశారు. అనంతరం నిర్వాహకులు సంపూర్ణ రామాయణ ప్రవచనం చేసిన పొన్నూరు శ్రీనివాసులును ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో కాలభైరవస్వామి మైనంపాటి సాయికుమార్, భక్తులు పాల్గొన్నారు.

ఉత్తమ సేవలందిస్తే సమాజంలో గుర్తింపు

- జాయింట్ కలెక్టర్ గోపాలకృష్ణ



సమావేశంలో మాట్లాడుతున్న జేసీ గోపాలకృష్ణ

ఒంగోలు అర్బన్: సమాజంలో తగిన సేవలు అందించడం ద్వారా మంచి గుర్తింపు వస్తుందని జిల్లా జాయింట్ కలెక్టర్ గోపాలకృష్ణ అన్నారు. కార్పొరేట్ సామాజిక బాధ్యత (సీఎస్‌సీ)లో భాగంగా సోమవారం సాంఘిక సంక్షేమ వసతి గృహాలను స్వీకరించే కార్యక్రమం నిర్వహించారు. స్థానిక కలెక్టర్ కాన్ఫరెన్స్ హాలులో నిర్వహించిన ఈ కార్యక్రమానికి జిల్లా ఎస్సీ సంక్షేమ శాఖాధికారి ఎస్.లక్ష్మానాయక్ అధ్యక్షత వహించగా, జేసీ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. మనిషి జీవితంలో జన్మకి, మరణానికి మధ్య సమాజంలో చేసిన సేవ స్థిరమైన గుర్తింపునిస్తుందని చెప్పారు. సమాజంలో సంక్షేమ వసతి గృహాల విద్యార్థులకు తగిన వసతి, ఇతర సేవలు అందిస్తే జీవితంలో విద్యార్థుల ఉన్నతికి చేయూతనిచ్చిన వారవుతారని అన్నారు. కార్యక్రమంలో భూగర్భ గనుల శాఖాధికారి జగన్నాథరావు, జిల్లా పారిశ్రామిక శాఖాధికారి శ్రీనివాసరావు, మత్స్యశాఖ జేడీ ఆవుల చంద్రశేఖర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

పొగాకు గ్రేడింగ్ చేసుకుని వేలానికి తీసుకురావాలి



సమావేశంలో మాట్లాడుతున్న వేలం నిర్వహణాధికారి రామకృష్ణ, రైతు సంఘాల నాయకులు

మద్దిపాడు: పొగాకు గ్రేడింగ్ చేసుకుని వేలం కేంద్రానికి తీసుకురావాలని వెల్లంపల్లి వేలం నిర్వహణాధికారి రామకృష్ణ సూచించారు. సోమవారం వెల్లంపల్లిలో ఏర్పాటు చేసిన ఫ్లోర్ కమిటీ సమావేశంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. గత సంవత్సరం అంతర్జాతీయంగా పొగాకు కొరత ఉన్న నేపథ్యంలో పచ్చలు, మాడు అని చూడకుండా కంపెనీల బయ్యర్లు కొనుగోలు చేశారని తెలిపారు. ఈ సంవత్సరం పొగాకును గ్రేడ్ చేసుకుని తెచ్చుకుంటే మంచి ధర లభిస్తుందన్నారు. కంపెనీలు కూడా పొగాకును ఆచితూచి కొనుగోలు చేసే పరిస్థితి నెలకొందన్నారు. రైతులు పండించిన పొగాకుకు మంచి ధర ఇప్పించడానికి కృషి చేస్తానని ఆయన తెలిపారు. వేలానికి తీసుకొచ్చిన పొగాకును బోర్డు అధికారులు చెప్పిన సమయానికే కాటా వేయించుకోవాలని, ఇబ్బందులు సృష్టించడానికి రైతులు ప్రయత్నించవద్దని ఆయన సూచించారు. పొగాకు బోర్డు సభ్యుడు పొద వరప్రసాద్ మాట్లాడుతూ పొగాకు బోర్డు ఈ నెల 6వ తేదీ అన్ని చోట్ల వేలం ప్రారంభిస్తోందని, అందువలన రైతులు నాణ్యమైన పొగాకు చెక్కలను వేలానికి తీసుకురావాలని కోరారు. కొందరు రైతులు మాట్లాడుతూ వెల్లంపల్లి వేలం కేంద్రం అతి పెద్దదని, ఈ కేంద్రం పరిధిలో బ్లాక్ సాయిల్, లైట్ సాయిల్‌లు ఉన్నాయని, అందువలన తేడాలు గమనించి ధర ఇప్పించే ప్రయత్నం చేయాలని వేలం నిర్వహణాధికారిని కోరారు. అనంతరం వేలం నిర్వహణాధికారిగా బాధ్యతలు స్వీకరించిన రామకృష్ణను పలువురు రైతులు సన్మానించారు. కార్యక్రమంలో ఫ్లోర్ లీడర్ అబ్బూరి శేషగిరి, మహేశ్వరరావు, వరహాలు చౌదరి, పలువురు రైతు నాయకులు, రైతులు పాల్గొన్నారు.

ఈవీఎంలపై తహసీల్దార్లకు అవగాహన



ఈవీఎంలపై అవగాహన కల్పిస్తున్న ఈఆర్‌ఓ వరకుమార్

చీమకుర్తి: సంతనూతలపాడు నియోజకవర్గ పరిధిలోని నాలుగు మండలాల తహసీల్దార్లకు సోమవారం సంతనూతలపాడులోని ట్రిపుల్ ఐటీ కాలేజీలో ఈవీఎంలపై అవగాహన కల్పించారు. ఈఆర్‌ఓ వరకుమార్ ఆధ్వర్యంలో ఈవీఎంలు పని చేసే విధానం గురించి వివరించారు. రానున్న ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని మండలాల వారీగా తహసీల్దార్లు బాధ్యతలు తీసుకుని గ్రామాల వారీగా ప్రజలకు ఈవీఎంల వినియోగంపై అవగాహన కల్పించాలన్నారు.

ప్రకృతి వ్యవసాయ పద్ధతులపై శిక్షణ



కార్యక్రమంలో మాట్లాడుతున్న డీఆర్‌డీఏ పీడీ వసుంధర

ఒంగోలు టౌన్: జిల్లాలో ఎంపిక చేసిన 115 మంది కృషి సఖులకు నేషనల్ రూరల్ లైవ్లీ హుడ్ మిషన్ (ఎన్‌ఆర్‌ఎల్‌ఎం) ఆదేశాల రైతు సాధికార సంస్థ ద్వారా ప్రకృతి వ్యవసాయ పద్ధతులపై ఐదు రోజుల శిక్షణ కార్యక్రమం సోమవారం స్థానిక టీటీడీసీలో ప్రారంభమైంది. పర్యావరణ సేవలు, ప్రకృతి వ్యవసాయం, నేల ఆరోగ్యం, పోషణ నిర్వహణ, జీవ ఉపకరణాలు, చీడపీడలు, నీటి నిర్వహణ, వ్యవసాయ వ్యవస్థలు, విత్తన వ్యవస్థ, ఆరోగ్యం, పోషకాహారం, బహుళ పంటలు, న్యూట్రిగార్డన్ తదితర పంటలపై అవగాహన కల్పించారు. శిక్షణలో భాగంగా మూడు రోజులపాటు గ్రామస్థాయిలో అమలు చేస్తున్న సేంద్రియ వ్యవసాయ క్షేత్రాలను కృషి సఖులు సందర్శిస్తారు. శిక్షణ అనంతరం మండల సమాఖ్య, గ్రామ సమాఖ్య, చిన్న సంఘాలకు కృషి సఖులు అవగాహన కల్పించాలని డీఆర్‌డీఏ పీడీ టి.వసుంధర సూచించారు. శిక్షణ కార్యక్రమంలో రైతు సాధికార సంస్థ డీపీఎం సుభాషిణి, కొండపి ఏరియా కో ఆర్డినేటర్ సునీత తదితరులు పాల్గొన్నారు.

అంతర్జాతీయ మహిళా దినోత్సవ కరపత్రాల ఆవిష్కరణ



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న కళాకారులు

ఒంగోలు మెట్రో: జిల్లా రంగభూమి కళాకారుల సంఘం, ఒంగోలు ఆలిండియా కళా రంగం, పద్మశ్రీ ఘంటసాల స్వరంజలి సంయుక్త నిర్వహణలో ఈ నెల 9వ తేదీ సాయంత్రం ఆరు గంటల నుంచి స్థానిక ఎన్టీఆర్ కళాక్షేత్రంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమానికి సంబంధించిన కరపత్రాలను సోమవారం ఉదయం స్థానిక సీవీఎన్ రీడింగ్ రూమ్ ప్రాంగణంలోని జిల్లా రంగ భూమి కళాకారుల సంఘం కార్యాలయంలో ఆవిష్కరించారు. బేతంశెట్టి హరిబాబు, అంగలకుర్తి ప్రసాద్, దేనువుకొండ సుబ్బయ్య, చల్లా నాగేశ్వరమ్మ, షేక్ సిద్ధాంబి, వెలనాటి మల్లికార్జునరావు, గుర్రం శివప్రసాద్, గ్రేస్‌కుమారి, ఎస్.వెంకటలక్ష్మి పాల్గొన్నారు.

7న జెడ్పీ సర్వసభ్య సమావేశం

ఒంగోలు సిటీ: జిల్లా ప్రజా పరిషత్ సర్వసభ్య సమావేశం ఈ నెల 7వ తేదీ గురువారం మధ్యాహ్నం ఒంటి గంటకు పాత జిల్లా ప్రజా పరిషత్ సమావేశ మందిరంలో జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ అధ్యక్షతన నిర్వహించనున్నట్లు జెడ్పీ సీఈఓ బి.జాలిరెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజాప్రతినిధులు, అధికారులు హాజరు కావాలని కోరారు.

7న జెడ్పీ స్థాయి సంఘాల సమావేశం

జిల్లా ప్రజా పరిషత్ స్థాయి సంఘాల సమావేశం ఈ నెల 7వ తేదీ గురువారం ఉదయం 10 నుంచి 12 గంటలకు వరకు పాత జిల్లా ప్రజా పరిషత్ సమావేశ మందిరంలో జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ అధ్యక్షతన నిర్వహించనున్నట్లు జెడ్పీ సీఈఓ బి.జాలిరెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 నుంచి 10.30 గంటల వరకు గ్రామీణాభివృద్ధి స్థాయి కమిటీ, ప్రణాళిక, ఆర్థిక విషయాల స్థాయి కమిటీ, పనుల స్థాయి కమిటీ వారు పాల్గొనాలని కోరారు. అలాగే గం.10.30 నుంచి 10.45 గంటల వరకు వ్యవసాయ స్థాయి కమిటీ సమావేశం, గం.10.45 నుండి గం.11.15 వరకు విద్య, వైద్య సేవల స్థాయి కమిటీ సమావేశం, గం.11.15 నుంచి గం.11.40 వరకు మహిళా, శిశు సంక్షేమ స్థాయి కమిటీ సమావేశం, గం.11.40 నుంచి 12 గంటల వరకు సాంఘిక సంక్షేమ స్థాయి కమిటీ సమావేశం నిర్వహిస్తున్నట్లు తెలిపారు.